
# చిన్నారి చిలిపి తునకలు



ఆఫీసులో అలసిపోయి ఇల్లు చేరిన గోపాల్‌కు తార ముఖం చూడగానే ఎక్కడలేని భయం పుట్టుకొచ్చింది.

"అలా ఉన్నావేం తారా ?" ఎంతో ఆందోళిత కంఠంతో ప్రశ్నించాడు. ఆమె నీరసంగా నవ్వింది. "తలనొప్పి—కొద్దిగ జ్వరం గూడ వచ్చినట్లుంది ?" తార మంచంమీద పడుకుంది.

గోపాల్ జ్వరం చూచాడు. నూరు డిగ్రీలు ఉంది. కొస్త భయపడ్డాడు. "ఏదైనా మందు ..."

ఆమె తల ఆడిస్తూ అంది; "సారిడాన్ వేసుకున్నాను."

"మలేరియా గాని కాదు గదా ?"

"ఏమో ?"

గోపాల్ ఆమె ప్రక్కలో కూచున్నాడు. ఎంతసేపైందో. తార కళ్ళు తెరిచి ప్రేమతో అంది; "మీ ధ్యాసే లేదు .... ఫ్లాస్కులో కాఫీ ఉన్నాయి... పిల్లలు రాలేదా ?"

"వాళ్ల స్కూల్లో డ్రామా వేస్తున్నారట. ఆరు గంటలయ్యాక దిగబెడ్తానని రిక్షావాడు చెప్పాడు. మరేం ఖంగారుపడ వవుసరం లేదులే."

గోపాల్ గుడ్డలు మార్చుకుని ముఖం కడుక్కుని కాఫీ త్రాగి తిరిగి తార ప్రక్కన కూర్చున్నాడు. ఆమె నుదురు రాస్తుంటే ఆమె కెంతో హాయిగా ఉంది. ఇంతకన్నా తనకేం కావాలి ? ఆ చేతిలో ఏం మహాత్మ్యం ఉందో గాని తన కెంతో తేలికగా ఉంది. మగతగా కళ్ళు మూసుకునే ఉంది.

"తారా ?" అని నెమ్మదిగా పిల్చాడు.

"వూ" అంది. కళ్ళుతెరిచి భర్తవైపు చూచి, చిరునవ్వు నవ్వింది.

"నేను వెళ్ళేటప్పటికి నువ్వు బాగానే ఉన్నావుకదూ ?"

తారకు కోపం వచ్చింది. ఐతే ఇదంతా దొంగ వేషమనుకుంటున్నట్లున్నారని మనసులో బాధపడింది. పైకి మాత్రం "ఊ"— అని అనగల్గింది.

"నాకేం తెలుసు నీకు ఇలా ఉంటుందని ? రేపు సాయంత్రం మా మేనేజర్‌ను భోజనానికి పిల్చాను తారా ?"

'అయ్యో .... మరెలా ? .... నాకు బాగయిపోతుందిలెండి" తార ముందు తన భర్తను గూర్చి చులకనగా తలంచినందుకు బాధపడింది.

"నీకు జ్వరం తగ్గినా చెయ్యలేవు సుమా? ఏం చేద్దాం ?" .... అతను మాట్లాడుతున్నాడు. తారతో కాక తనతోనే మాట్లాడుకున్నట్లుంది. తార భర్త ముఖంలోకి జాలి మిళితమైన చూపులతో చూస్తూ "తగ్గకేం చేస్తుందిలెండి! రేపు సాయంత్రానికి కదా ? మీరు సెలవుపెట్టారంటే అంతా సవ్యంగా జరిగిపోతుంది. .... మీరంతగా విచారించవలసినపనే లేదు."

గోపాల్ తల అడ్డంగా ఆడించాడు అలా కాదని. తార ముఖం ఎంతో పీక్కుపోయి కళా విహీ

వంగా ఉంది. రొంపతో కంఠం మారిపోయింది. ఈ పరిస్థితుల్లో ఆమె అంత త్వరగా మామూలు మనిషి అవుతుందనుకోటం ఒట్టి భ్రమే అవుతుంది. ఎంతైనా కనీసం రెండు రోజుల వరకైనా ఆమెకు పూర్తి విశ్రాంతి అవసరం. ఇవే ఆలోచనలతో ఆమెను చూస్తూ మారు మాట్లాడకుండా కూర్చున్నాడు.

పిల్లలొచ్చేసరికి ఆరున్నరైంది. వాళ్ళకి గుడ్డలు మార్చి ముఖాలు అవీ కడిగి పాలు కలిపి అందరికీ త్రాగనిచ్చాక డాక్టరుకోసం బయలుదేరాడు.

లేడీ డాక్టరు వచ్చి చూచింది. ఇంజక్షన్ ఇచ్చి మందులు, మాత్రలు ఇచ్చి బాగా విశ్రాంతి అవసరం అని చెప్పి వెళ్ళిపోయింది. తార శ్వాస క్రమబద్ధమైంది. నిద్రపోయిందనుకుని గోపాల్ హోటల్ నుంచి భోజనం తెచ్చి తాను, పిల్లలు తిని పడుకున్నారు.

గోపాల్‌కు ఎంతకూ నిద్ర పట్టింది కాదు. తను ఆ కంపెనీలో చిన్న ఉద్యోగంలో ఉన్నాడు. ఆఫీసరు వచ్చాడు. క్రొత్త బ్రాంచికి అసిస్టెంటు మేనేజరు కావాలి. తనబోటి వాళ్ళలో ఒకరిని ఎన్నుకునేందుకు వచ్చాడు. అతని ప్రోగ్రామ్ నిండుగా ఉంది. రేపు సాయంత్రం ఖాళీగా ఉన్నాడు. అందువల్ల భోజనానికి పిల్చాడు. అతడు పంజాబీ. తారకు పంజాబీ వంటలు తెలుసు. వారు కొన్నాళ్ళు హైదరాబాద్‌లో ఉన్నప్పుడు వాళ్ళ ప్రక్క ఇంట్లో పంజాబీ దంపతులుండేవారు. రెండు కుటుంబాలకు స్నేహం బాగా కుదిరింది. అప్పుడే నేర్చుకుంది తార. మామూలుగా రోజూ చూస్తుంటేనే వచ్చేశాయి గానీ ఒకప్పటికి అవి అవసరపడ్తాయని ఆమె అనుకోలేదు. తారకు నమ్మకంగా అన్న ధీమాతో ఆయనను ఆహ్వానించాడు. కానీ .... అంతా తారుమారయ్యేలా ఉంది .... తార ఇప్పుడే లేచి తిరగలేదు .... ఆ వంటలు చేయలేదు .... ఏం చెయ్యాలి ?

పిల్లలు ముగ్గురు నూడూ సేమ టపాకాయ అనుకోవాలి. ఆరున్నర సంవత్సరాల అరవింద్ ఆటంబాంబులా హుషారుగా ఉంటాడు. అయిదు సంవత్సరాల శాంతి, మూడున్నర సంవత్సరాల అరుణ్ చిటపటనవు తునకలు. వాళ్ళ ముగ్గురిని సర్ది బడికి పంపేసరికి ఇద్దరి తల ప్రాణాలు తోకకు వచ్చేవి. వాళ్ళు అలా రిక్షా ఎక్కి వెళ్ళిన పది నిముషాల వరకు తార, గోపాల్ ఏమీ చేయలేక విశ్రాంతిగా హాల్లో కుర్చీలలో నిశ్చింతగా కూచోటం పరిపాటి. గాలి వానానంతరం ప్రశాంతత ఉన్నట్లుండేది.

మరుసటిరోజు శనివారం. పిల్లలకు ఒక పూట మాత్రం బడి. గోపాల్ గుండెలు రుుళ్ళుమన్నాయి. ఆమ్మో— పిల్లలు— ఇంట్లో ఉంటే అయినట్లే. ఏంచెయ్యాలి? ఎవరింటికైనా పంపితే— ఎవరు మాత్రం వోర్చుకో గలరు ? అరగంట— లేక గంట అయితే మొగమాటం కొద్దీ భరించి వాళ్ళను చూసుకోగలరు గాని, మూడు నాల్గు గంటలు సహించగలరా? చెప్పొద్దూ— తను తండ్రి కాబట్టి వోర్చుకోగల్గుతున్నాడు. పరాయిపిల్లలయితే తను మాత్రం వోర్చుకుంటాడా ?" హద్దూ పద్దూ లేకుండా పెంచుతున్నారు— మరీ విపరీతం" అని కూడా అనేసేవాడే.

ఆలోచించేకొలది—సాలెగూడులో చిక్కుకున్న ఈగలా సమస్య మరీ క్లిష్టమైపోతుంది.

ఇందులో ఇరుక్కున్నాడు. వెనుదిరిగిపోలేడు. ఎలాగైన, ఏదో వంట వండి ఆఫీసరును మర్యాద చేయాలి. తప్పదు. ఇదే మార్గం కనబడింది. పరిస్థితులకు తలొగ్గి సముదాయించుకుని పడుకునే సరికి అర్ధరాత్రి అయింది !

తెల్లవారి లేచి గబగబ అన్ని పనులు కానిచ్చాడు. తారకేమాత్రం సుళువుగా లేదు. ఇంకొంచెం ఎక్కువైనట్లుంది. నీళ్ళు కాచి ముఖం కడిగించి కాఫీ యిచ్చాడు. పనావిడతో గదంతా డెటాల్ వేసి కడిగించాడు. ఆమె గది బల్లమీద మందులు, ఫ్లాస్కు, థర్మామీటరు అన్నీ చక్కగా అమర్చాడు.

క్రిందా మీదా పడి ముగ్గుర్నీ తయారుచేసి బడికి పంపాడు. స్నానంచేసి వండిన అన్నంలో మజ్జిగ పోసుకుని గబగబ తినేసి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

తార మగతగా మంచానికి అతుక్కుని పడుకుని ఉంది.

పన్నెండు గంటలకు ముందే గోపాల్ వచ్చేశాడు. ఆందోళితహృదయంతో తారను సమీపించాడు. జ్వర తీవ్రత తగ్గింది. 'పోనీ' అనుకున్నాడు. పాలు కలిపి ఇచ్చేశాడు.

తలుపుమీద దబదబ బాదిన శబ్దం. పుత్ర పుత్రికా రత్నాల గోల అది. గోపాల్‌కు అసలు సమస్య ఎదురైంది. కోపం వచ్చింది. తలుపు తెరిచాడు. "నాన్నా .... నువ్వు ఆఫీసుకెళ్ళలేదా ?"

"మీకు సెలవా ?" "మమ్మల్ని సర్కస్‌కు తీసుకెళ్తావా ?" జోళ్ళు విప్పుకుంటూ, పుస్తకాల సంచీలు భుజం దిగకముందే గోల ప్రారంభించారు.

మామూలు రోజుల్లో అయితే తగిన సమాధానాలు చెప్పేవాడు. కానీ ఈరోజు అంత వోపిక లేదు. తీరా శ్రమపడి వాళ్ళ ఆఫీసరుకు మర్యాద చేసే సమయంలో ఈ అల్లరిమూక ఏం గొడవ చేసి తంటా తెస్తారో అని బెరుకుగానే ఉంది. అందుకని వాళ్ళమీద మరీ కసిగా ఉంది.

ముగ్గుర్నీ కుళాయి దగ్గరకు తీసుకెళ్ళాడు. ఏమీ మాట్లాడలేదు. వాళ్ళకు అంటిన దుమ్ము వదిలిపోయేలా కడిగి అన్నంపెట్టి ముగ్గుర్నీ తార దగ్గరకు తీసుకెళ్ళాడు. తార కొద్ది క్షణాలు వాళ్ళతో ముచ్చటించింది. గోపాల్ బయటికి వెళ్ళాడు. కొంత సేపటికి గోపాల్ గదిలోకి వస్తూ పెద్ద పేము బెత్తంతెచ్చి, సర్కస్‌లో ఆడించినట్లు "ఝు షు" మని శబ్దం చేశాడు.

పెద్దవాళ్ళిద్దరు హాస్త బెదిరారు. చిన్నవాడు మాత్రం "నాన్నా 'జూమ్' మని మళ్ళా అనిపించు ...." అన్నాడు.

"ఆ. ఆ. అనిపిస్తాను. ఆగరా" అన్నాడు. నవ్వు వచ్చింది గాని ఎంతో ప్రయత్నం మీద నవ్వు ఆపుకోగల్గాడు.

"ఏయ్. వినండి. ఇవ్వాళ మనింటికి ఒక పెద్ద మనిషి వస్తారు ......"

"అంటే పెద్దగా ఉంటాడా నాన్నా" శాంతి కళ్ళు పెద్దవిచేసి ప్రశ్నించింది.

"లేదు .... అంటే ఒక మామయ్య వస్తారు."

"హో .... మనకు చాక్లెట్లు అవీ తెస్తారు మామయ్య కదా ?"

అరుణ్ ముఖం ఆరవిందమైంది.



"ఈ మామయ్యే తీసుకురారు."

"ఎందుకు మంచారు కారూ ?" అరవింద్ తేల్చాడు.

"అయ్యో—చాల మంచి మామయ్య. గెడ్డం ఉంటుంది. తలపాగా చుట్టుకుంటాడు. ఏమిటి—ఎందుకు అని అడక్కూడదు ?"

"ఎందుకని ?" రెండు కంఠాలు శృతి కలిపినై.

"ఆయనకు అలా అడిగితే కోపం వస్తుంది ?"

"కోపం వస్తే ఏం చేస్తారు ?"

"నన్ను వన్లోనుంచి తీసేస్తారు ?"

"అప్పుడు ?"

"మనకు తినటానికి ఏమీ ఉండదు. ఈ ఇల్లు ఉండదు. మీకు చాకలెట్లు, క్రొత్త గౌన్లు షర్టులు, లడ్డూలు, ఏవీ ఉండవు."

"అయ్యో" నిజంగానే—పిల్లల ముఖంలో దిగులు కొనవచ్చింది.

"అందుకని, మీరు బుద్ధిమంతుల్లా ఉండాలి. మామయ్య రాగానే నమస్కారం చెయ్యాలి. చక్కగా కుర్చీలల్లో అల్లరి చేయకుండా కూచోవాలి. లేక పోతే అమ్మ గదిలో ఇక్కడే చాపమీద ఆడుకోవాలి."

"మీరేం చేస్తారు ?" శాంతి విసుగ్గా అడిగింది. గింది.

"మామయ్యగారు భోజనానికి వస్తారా. నేను వంట చెయ్యాలి. ఇప్పటినించి సాయంత్రం మామయ్యగారు వెళ్లేవరకు గోల చేశారో వీపులు బద్దలవుతాయి జాగ్రత్త—తెలిసిందా ?" కళ్లెర్ర జేసి ఉరిమిచూచి బెత్తాన్ని ఝళిపించాడు. పిల్లలు నిజంగానే భయపడి వెనక్కు తగ్గారు.

"తెలిసిందా ?" అని హుంకరించి గబుక్కున వెళ్లిపోయాడు. పిల్లలతో ఇదే మొదటిసారి ఇంత కఠినంగా ఉండటం. నాటకంలో తన పాత్రను ఒప్పగించినట్లు ఈ సమయంలో కఠినత్వాన్ని చవి చూపించాడు. అతడు స్వతః కోపదారి కాడు. అందువల్ల మెత్తబడకముందే వాళ్లను వదిలి వెళ్లి పోయాడు.

పిల్లలు బిక్కుబిక్కుమంటూ కూచున్నారు. ఏదో విషమ పరిస్థితి వచ్చిందని గ్రహించారు. లేకపోతే నాన్నకు అంత కోపం లేదే! తారకు నవ్వు వచ్చింది. గోడవైపు తిరిగి కళ్లు మూసుకుంది. కానీ పిల్లలంటే ఆమెకూ భయంగానే ఉంది.

గోపాల్ బజారునించి పండ్లు, ఐస్ క్రీమ్, బాదంహల్వా తెచ్చాడు. ఇంట్లో అన్నం— సాంబారు— బంగాళాదుంప వేపుడు— అప్పడాలు, పెరుగు— చేసి పెట్టాలని అనుకున్నాడు.

ఇల్లంతా శుభ్రంగా సర్ది పిల్లలకు ఏవీ గుడ్డలు వేయాలో తీసిపెట్టుకుని— తారకు కావలసినది అందించి— ఒక్కసారి పిల్లలకు భద్రం చెబుతూ హెచ్చరించి వంటింట్లోకి దూరాడు. బెత్తం అక్కడే ఎదురుగా ఉంచాడు.

వంటిల్లు కొద్ది దూరంలో ఉంది. ముందు నాలుగు గదులు. అవుట్ హవుస్‌లాగున వంటిల్లూ భోజనాల గదీ స్వంత ఇల్లు— ఏ కాలం నాటిదో— కానీ మరీ పాతగా లేదు. భోజనాల గదిలో పీటలు వేసి అన్నీ సర్ది పెట్టుకున్నాడు. వంట ప్రారంభించే సరికి ఆరు గంటలైంది. కుంపటి, స్టౌ పోటీ చేస్తున్నాయి. గోపాల్ పంచెపైకి గోచి భుజం మీద

## చిన్నారి చిలిపి తునకలు

కండువాతో పాకశాల వ్యూహంలో నిమగ్నమై పోయాడు.

తన కార్యక్రమం ఇంతవరకు ఏ విధమైన లోపం లేకుండా భంగం కలక్కుండా సాగినందుకు తన్ను తానే ఒక్కసారిగాదు గదా వేయిసార్లు అభినందించుకున్నాడు.

పాపం పిల్లలు నిజంగానే హడలి పోయారు. గదిలో కూచుని ఆడుకుంటున్నారు కాబోలు ఏడు గంటలైంది. వాళ్ళ దుస్తులు మార్చాలి. ఎనిమిది గంటలకు రావలసినదిగా కోరినా ఆఫీసరు ముందు గానే రావచ్చు!

అంగణం దాటి వెనుకవైపు వరండా సమీపించాడు. కానీ పిల్లల సందడి లేదు. పాపం—కుక్కిన పేన్లలా ఉన్నారు— అనుకుని ఒక గది దాటాడు. ఇంకా శబ్దం లేదు. ప్రక్కగదిలో తార ఉంది. తారా— అని నెమ్మదిగా పిల్చాడు.

"ఊ. . . . వంట అయిపోయిందా ?" అంది నీరసంగా.

"అయిపోయినట్లే— పిల్లలేరీ ?" అన్నాడు.

"మీ ఫ్యూన్ వచ్చాడు. పిల్లలు పార్క్‌కు

---

జోతిష్యుడు : మీాకు ఈ సంవత్సరం పెళ్ళిగండం ఉంది.

యువకుడు : బాబోయ్! నా కేమిటి గతి ?

జో : వంటగది ...

కె. రంగారావ్ (కాకరపర్రు)

---

వెళ్తామని తొందరచేశారు. . . . వాళ్ళకూ పొద్దు పోతుందని పంపాను" అంది.

"సరే—సరే..... అంతా నిశ్శబ్దంగా ఉంటే ఆశ్చర్యపోయాను. కాస్త పూరీలు వత్తాలి.... అంతే.. నీకు ఏమైనా.... ?"

"అహ—నాకిప్పుడే ఏమీ వద్దు. ఇంత శ్రమ పడుతున్నారా. హోటలు నించి తెచ్చిపెడితే...."

అతను అడ్డు తగిలాడు "ఏం మర్యాద చెప్పు ? ఏదైనా ఇంటి భోజనంతో సాటిరాదు.... గంగ గోవుపాలు..... లాగ..... ఏమంటావు ? నాకిప్పుడు ఒకే కోరిక.... నన్ను సెలెక్టు చేసుకోవటం అటుంచు.... మన మర్యాదతో లోటురాకుండా.... కోపం తెచ్చుకోకపోతే పదివేలు.... సరే.... వస్తా.." అంటూ వెళ్ళిపోయాడు. భర్త శ్రమపడటం చూస్తూ నిస్సహాయంతో చూస్తూ కన్నీరు పెట్టుకుంది తార.

కొద్దిసేపటికి నిప్పులున్న గరిటెతో వచ్చాడు. తార కాళ్ళకవతలివైపున ఉంచి ఇంత సాంబ్రాణి పొగవేసి, కాసేపాగి కిటికీలన్నీ తెరచి వెళ్ళిపోయాడు. తార తృప్తిగా కళ్ళు మూసుకుంది "హే భగవాన్.... వారి శ్రమకు ఫలితం దక్కనివ్వు" అని మనసార వేడుకుంది.

తారకు ముందు గదిలోంచి మాటలు విన్పించాయి. తన గదికి ముందు డ్రాయింగ్ రూమ్‌కు తలుపే అడ్డం.

పిల్లల మాటలు స్పష్టంగా విన్పిస్తున్నాయి. ఇంకొకతని మాటలు విన్పించాయి. తార చెవులు రిక్కించి వింటుంది....

"మీా నాన్నగారేం చేస్తున్నారు ?" ఆ కంఠం క్రొత్తగా ఉంది.

"మీా నాన్న వంట చేస్తున్నారా"

అహ్హహ్హా—అని నవ్వు.... పిల్లలు గూడ నవ్వారు. ఎందుకో! ఒకరు నవ్వితే అకారణంగానే నవ్వుతారు పిల్లలు.

అతని మాటలు కొత్తగా ఉన్నాయి. ఆమెకేదో స్ఫురించింది. గుండెలు ఝల్లుమన్నాయి. నెమ్మదిగా లేచి తలుపు కన్నంలోంచి చూచింది. ఆ చూచిందే తడవులేని శక్తి తెచ్చుకుని గుమ్మంలో కెళ్ళి నుంచుంది.... భర్తను పిలవాలని. నెమ్మదిగా పిల్చింది. వినబడితేగా ? గోపాల్ రాలేదు. ఆమె నుంచోలేక మంచం మీాద పడుకుని వారి సంభాషణ వింటోంది.

తార చూసేసరికి ఒక గడ్డము తలపాగా గల వ్యక్తి ఒడిలో అరుణ్ కూచుని ఉన్నాడు. ప్రక్క కుర్చీలో పెద్దవాడు, ఆయన ప్రక్కలో శాంతి ఉన్నారు. తార గ్రహించింది అతను వాళ్ళ ఆఫీసరని.

కాసేపాగి మళ్ళీ భర్తకోసం వెళ్ళింది..... ఫలితం శూన్యం. పిల్లలను పిల్చింది మెల్లిగా.... వారసలీలోకంలో ఉంటేగా ? తారకాళ్ళు తడబడ్డాయి. విధిలేక వెళ్ళి కూచుంది. మంచం ఇంకాస్త తలుపుకు సమీపంగా జరిపింది.

".... అయితే మీరేనా మామయ్య ?" అరుణ్ ప్రశ్న.

"మాకు ఇంకో మామయ్య ఉన్నాడు. చాల మంచి మామయ్య" శాంతి అంటోంది.

"నేనూ మంచివాడినేగా ?"

"అవును మా నాన్న చెప్పాడు.... కానీ.... మీరు ఏమీ తేలేదుగా ? మా మామయ్య ఎన్నో మిఠాయిలు తెస్తాడు"

అరవింద్ ధీమాగా అంటుంటే తార కోపంతో ఒణికి పోయింది.

మళ్ళీ భర్తకోసం వెళ్ళింది. స్నానాల గదిలో చప్పుడు. గడియారం ఏడూ పదిహేను అయినట్లు చూపుతోంది.

నీరసంతో మళ్ళీ వెళ్ళి కూచుంది ఓరగా......

"మా మామయ్యకు గెడ్డం.... సేమ్యాలు.... ఉండవ్"

అరుణ్ మాటలకు పిల్లలతోపాటు ఆయన కూడ నవ్వేశాడు. తారకు చిరునవ్వురాక తప్పిందికాదు.

శాంతి అంది: "అహ .... అహ హ.... సేమ్యాలు కాదురా మీసాలు"

"నీ పేరేంటి ?" ఆయన అడిగాడు.

"నాపేరేమో అరవింద్— ఇదిగో శాంతి, ఇడుగో అరుణ్"

"నా పేరు అలుణ్ కాంత్"

"వాడికి 'ర' పలకటం రాదులెండి. అరుణ్ కాంత్...." శాంతి స్పష్టీకరించింది.

"నీ పేరు ఏమిటి ?" శాంతి అడిగింది.

"వాట్ ఈజ్ యువర్ నేమ్ ?" అరవింద్ ప్రశ్న.

"నా పేరు అమర్‌సింగ్"

"సింగ్ అంటే" శాంతి ప్రశ్నవేసి ముఖంలోకి చూస్తూంది.

"తెలీదూ ఎస్. ఐ. ఎస్. జి. సింగ్ అంటే వాడు.... మా మదర్ చెప్పారు.... నీకు తెలీదులే.."

"ఓహో వాడు అనొచ్చన్నమాట. అమర్ వాడు.... బలేగా ఉంది పేరు...." కిలకిల నవ్వింది శాంతి.

అతను హాయిగా నవ్వాడు. "మరి మీ నాన్న గారి దగ్గర కెళ్ళి ...."

ఒక్కసారి గోలపెట్టారు.... అదీ చాలా నెమ్మదిగా "మా నాన్న తంతాడు.... ఏమన్నాడంటే.... ఒరేయ్ ఇప్పటి నుంచి సాయంత్రం దాక గోలచేస్తే వీపులు పగలగొడ్తాను అని. ఇప్పుడు వెళ్తే— అక్కడే ఉంది బెత్తం.... చావ బాదేస్తాడు. మేము వెళ్లము."

"మీ అమ్మగారితో చెప్పండి"

"మా అమ్మకేమో జ్వరం. పడుకుంది" శాంతి మామూలుగా అనేసింది.

తార మనస్సులోనే శాంతి రెండు చెవులు గిరగిర మెలిపెట్టేసింది.

గడియారం చూచింది. ఐదునిమిషాలన్నా దాటలేదు ! "మా నాన్న ఐస్‌క్రీమ్ తెచ్చాడు" అరుణ్ నోటినిండా పల్కాడు. "బాదం హల్వా కూడ" శాంతి కలిపింది.

"మీ కిష్టమేనా ?"

"ఓ! చాల ఇష్టం కానీ జబ్బు చేస్తుందని మాకు పెట్టరు.... వాళ్లిద్దరే తింటారు ? వాడూ.. మాకు జబ్బు చేస్తుందట. వాళ్లకు చెయ్యదు. ఎందుకు ?"

"మేమంతా పెద్దవాళ్లం. అందుకని" వాడు అన్నాడు.

"ఐస్‌క్రీమ్ మాకూ ఇష్టం. నువ్వు కూడా ఒక్కడివే తింటావా ?" గోముగా అడిగాడు అరుణ్.

"లేదులే మీకూ పెడ్తాను" అతను అన్నాడు.

"మా నాన్న తిడితేనో ?"

"నన్ను తిట్టరులే.... అసలు మిమ్మల్ని కొడతారా ఎప్పుడైనా"

"ఊహు కోపం వస్తే పొడలకొడ్తారు గానీ కొట్టరు...." శాంతి అంది.... "అరవింద్‌ను కొడ్తారు."

"మరేమో వో సారేమో సిగ్‌రెట్ తాగాడు" శాంతి అంది.

"అహ—ఎట్లా ఉంటుందోనని ఆ సోఫాలో అలా పడుకుని కాల్చాను లెండి.... భారం వేసి దగ్గాను. అమ్మ చూచింది. అంతే.... నాన్న బెత్తంతో బాదాడు....."

"అసలు నీకు సిగరెట్ ఎక్కడిది ?"

"ఉస్— చాక్‌లెట్లు కొనుక్కోమని అమ్మ రెండు అణాలిస్తే అందులో ఒక సిగరెట్ కొన్నాను. ఇంకోటి నా జోబీలో ఉంది...."

"ఏదీ" ఆయన ఆత్రంతో అడిగారు.

అరవింద్ దూరంగా వెళ్లి జోబులోంచి ఒక సిగరెట్ తీసి నోట్లో పెట్టుకున్నాడు.

"ఆ.... ఆస.." అంటూ ఆయన ముందు కెళ్ళారు.




## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ,మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళవివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము మూలముగామేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ లగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము,ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు,మార్పులు,ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు.1.25న. పై. లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం). దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైనపంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTHISHI (A.W.P)
P. B. 86, JULLUNDUR CITY.



# నాణ్యత మరియు పొదుపు కుటుంబం అంతటికి




CAPT G.2 TEL.

## కాల్గేట్

బహుళ వినియోగ టాల్కు

అపురూపమైన పువ్వుల శాశ్వత సువాసనగలది!

తార గబుక్కున లేచి కన్నంలోంచి చూసింది. కోపంతో కళ్ళు కెంపులయ్యాయి. అరవింద్ ఠీవిగా నోట్లో సిగరెట్ పెట్టుకుని వెనక్కి జరుగుతున్నాడు. ఆయన గబుక్కున రెక్క పుచ్చుకుని నోట్లో సిగరెట్ లాగాడు. సిగరెట్ చేతి కంటుటం అతను విరగబడి నవ్వటం.... తార కంతా అయోమయంగా ఉంది. శాంతి నవ్వు.... అరుణ్ నవ్వు....

"యూ— నాటీ" అంటూ ఆయన ఆ సిగరెట్‌ను నాల్గు ముక్కలు చేసి తలొకటి ఇచ్చి తనొకటి నోట్లో వేసుకుని నవ్వుతూ కూచున్నారు. తార ఆరాటం తగ్గింది... వేదన... వెంకీభుటం అనుకుంది.... ఇంకా ఏం చేస్తారోనని అతి ప్రయత్నంతో వంటింటి వైపు కెళ్ళింది. వంటిల్లు గొళ్ళెం పెట్టేఉంది ! ఎక్కడికో వెళ్ళాలనుకుంది. బాత్‌రూమ్ తెరచే ఉంది. తార భయం భయంగా వచ్చి కూచుంది.

"అరె.... మీకు నల్లకళ్ళద్దాలున్నాయే" అంటూ అరుణ్ కూలింగ్‌గ్లాసస్ జేబులోంచి లాగాడు.

ఆయన వాటిని తీసి భద్రంగా బల్ల మీదుంచాడు. అరుణ్ కు నచ్చలేదు "నాకు ఆ కళ్ళజోడంటే భలేగా ఇష్టం. మా నాన్నని పెట్టుకుంటాను" అని ఒళ్ళోంచి దిగి బల్లమీదున్న గోపాల్ కళ్ళజోడు అందుకోబోయాడు— అంతే... వెంటనే అరవింద్ గట్టిగా అన్నాడు.

"ఒరేయ్.... అవి నాన్నగారివి.... పెట్టుకున్నావంటే పాడైపోతాయి తెలుసా ? ఇంద మామయ్యగారిది పెట్టుకో" అంటూ అరుణ్ కు అందించాడు.

ఆయన హాయిగా నవ్వాడు. తారకూ నవ్వాగింది కాదు— నుళ్ళీ భయం !

అరుణ్ పెట్టుకున్నాడు. పౌర్ణమి చంద్రబింబంలా ముఖం ఆనందంతో నిండిపోయింది.

మళ్ళీ ఆయన తొడమీద కూచునేందుకు వస్తూ అరవింద్ కాలు తగిలి బోర్లా పడ్డాడు. కళ్ళజోడు క్రింద పడింది.

"అయ్యో" అంటూ అరవింద్ వాటిని చేతిలోకి తీసుకుని పరీక్షగా చూడసాగాడు.

ఆయన ఆత్రతతో అడిగారు "పగిలాయా?"

"ఊహూ—" అని తల ఆడించాడు.

"పగిలినా పర్వాలేదు.... కదూ అరవింద్ ? మామయ్యా! మని అరుణ్ ఒకసారి ఏం చేశాడో తెలుసా ?.... ఒక కప్పు పగలగొట్టి జిగురు, గోంద్ అంటే గమ్‌వేసి అంటించాడు. అలానే పెట్టాడు. అమ్మ చూసి మా అందరితో నేసింది.... ఒకటేగా నవ్వాము... ఇహి ఇహి.... హి...." ఆయన నవ్వారు. కానీ వెంటనే ఆగిపోయారు. అరుణ్ బిక్కముఖంతో పిల్లవంక చూస్తున్నాడు.

"రా...అరుణ్ కూచుందుగాని...మరేం భయం లేదులే"

అరుణ్ కూచున్నాడు. "మీరు చాలామంచోలు" అన్నాడు కుదురుగా సర్దుకుంటూ.

'మీరందరుకూడ మంచివాళ్ళే ...కదూ అరవింద్.'

ఔను. మేమందరం చాలామంచివాళ్ళం.......... కానీ ఎవరూ అనరు......న్" అన్నాడు.

ఆయనకు నవ్వు తెరలు తెరలుగా వచ్చింది. తారకు చుక్కాగలేదుకాదు. భర కోసం వెనక్కి తిరిగి చూసుకుని మరొకసారి వెళ్ళిందిగాని గోపాల్ లేడు. ఎక్కడికి

# చిన్నారి చిలిపి తునకలు

వెళ్ళినట్లు ? మళ్ళీ తన స్థానానికొచ్చి చేరగిలబడింది. గడియారం ఏడు ముప్పై ఐదు చూపుతోంది.

"మామయ్యా...పాడూ...ఇక్కడికి సర్కస్ వచ్చింది....మరేట సైకిల్ త్రొక్కే అతనిమీద ఒక అబ్బాయి మెడమీద, మరిద్దరు చెరొక చేతి మీద కూచున్నారట. ఎవరూ ఏమీ పట్టుకోరు.... ఎలా చేస్తారో...కదూ?" అరవింద్ సర్కసు వచ్చినప్పటినుంచి రోజుకో పందసార్లైనా వెళ్ళాలని అనుకునేవాడు. ఆ ధ్యానలోనే అడిగాడు.

"ఏముంది ? మామ మెడమీద మన్ను కూచో.... ఆ చేతి మీద నేను, ఈ చేతిమీద నేను, ఈ చేతిమీద అరుణ్ ... ఊ ఎక్కు అరవింద్ అరుణ్ లేచినుంచో... మామయ్యా లేవరి...నడువు లే. సైకిల్ లేదుగాని...లే.....లే."

ఆయన ఎంత వారించినా వినటంలేదు. తార కన్నంలో చూడలేక పడుంవాల్సి వచ్చు క్షణాలన్నా కాలేదు, పిల్లలు ఒకటే గోల చేస్తున్నారు.. ఇక లాభంలేదు. గబుక్కున లేచి— దుప్పటి నిండుగా కప్పుకుని గదిలోకొచ్చింది. ఆమె కళ్ళబడిన దృశ్యం

పెండ్లి చూపులకు వచ్చిన

పెద్దమనిషి : మీ అమ్మాయికి పాటలు పాడటం వచ్చునా ?

పిల్లతండ్రి : ఎందుకండీ! అమ్మాయితో పాటు ట్రాన్సిస్టర్ పంపుతాముగా !

ఎ. కృష్ణయ్య (తిరుపతి)

ఆమెను అచేతనంగా చేసింది. కొయ్యబారి అలా కళ్ళప్పగించి చూస్తోంది.

పాపం ఆయన అతికష్టంతో లేవాడు. శాంతి, అరుణ్ లు చేతులుపైకెత్తటానికి గోల చేస్తున్నారు. అప్పుడే మెడమీద స్వారీ చేస్తున్న అరవింద్ చేతులు పైకెత్తి గోలగోలగా అరుస్తున్నాడు.

"ఒరే...దిగండి" అంది తార కటువుగా.

తల్లిరాక గమనించకుండా. ఆమె స్వరం వినగానే అరవింద్ ఒక్క దూకున క్రిందపడ్డాడు. శాంతి అరుణ్ లు వారి ప్రయత్నం విరమించుకున్నారు. ఆయన కాలరు సరిచేసుకుని అతి ప్రయత్నంతో చిరునవ్వు నవ్వారు.

పిల్లలు ముగ్గురు బెల్లం కొట్టిన రాళ్ళలా అతి అణుకువతో నుంచున్నారు.

తార వినయంగా నమస్కరించి అంది, "నాకు వంట్లో కులాసాగా లేదు. మీకు తగిన మర్యాద చేయలేక పోయాను...క్షమించండి. పిల్లలు చాల తుంటరి వాళ్ళు..... మీరన్యథా భావించకండి.... వారు లేరు. ఎక్కడికో వెళ్ళారు....." పూర్తిగా మాట్లాడుతూంటే ... అంతలో నగర్పుకుంటూ గోపాల్ ముందు వాకిలిలోంచి లోపలికి వచ్చాడు.

ఆయనకు సవినయంతో నమస్కరించి "ఏమను వచ్చి అరగంట దాటినట్లు ప్యూన్ చెప్పాడు. సార్‌కిల్ పిల్లలను కలిశారట మీరు....?...మీకెంతో శ్రమ కల్గించాను....మా ప్రక్క ఇంట్లో వారబ్బాయికి ఫిట్స్ వచ్చాయి. ఆయన లేరు పాపం. వెనుక వైపు పిట్టగోడ దగ్గరకొచ్చి చెప్పింది. డాక్టరును తీసకొచ్చి అప్పగించి వచ్చాను. ఆలస్యమైంది....మీరు క్షమించాలి....." గోపాల్ ఇంగ్లీషులో అంటున్నారు.

"మామయ్యకు తెలుగు వచ్చు" అరవింద్ అన్నాడు.

"సార్...మీకు తెలుగు వచ్చునా ?"

"అవును ఇరవై సంవత్సరాలుగా ఉంటే రాదూ? మరేం ఫరవాలేదు. పిల్లలతో బాగా ఎంజాయ్ చేశాను"

గోపాల్ గుండెలో ముల్లు గుచ్చుకుంది. చటుక్కున పిల్లల వైపు చూచాడు. ఏమీ ఎరగనట్లు వినయవిధేయతలతోనే సృష్టించినట్లు ఎంతో అమాయకంగా అగుపించారు. తారవైపు చూచాడు. తార పిల్లలవైపు చురచుర చూసి ఆయనను క్షమాపణ వేడి లోపలికెళ్ళింది.

ఆమెకు జర్వం త్రీవరూపం దాల్చినట్లుంది. శ్రమ అంతా వృథా అయింది. సెలెక్షను మాట దేవుడెరుగు...మట్టూ మర్యాద తెలిని, మూర్ఖులను కోరూ? అవమానించాడు అనుకోరూ? ఎందుకీ విధంగా జరగాలి? పిల్లలను తను ముందే వెళ్ళి ఎందుకు లోపలికి తీసుకురాలేక పోయింది? క్రమశిక్షణ— హద్దు పద్దు లేకండా పిల్లల్ని పెంచుతున్నారనుకోరూ...తను వెంటనే ఏందుకు వెళ్ళలేక పోయింది.? పిల్లలైనా నచ్చి ఉంటే వాళ్ళను ఆపేసేదే...కానీ...." ఎక్కడలేని నీరసం...ఎక్కడలేని కోపం ఆమె నావరించాయి.

మోకాళ్ళ వరకు శరీరాన్ని ముడుచుకుని పడుకుంది తార.

గోపాల్ ఆయనకు భోజనం వడ్డించి, పిల్లలకు కొన్ని దూరంలో ఆకులువేసి వడ్డించి తనూ కూచున్నాడు. రెండోసారి బెత్తం చూపటంతో వాళ్ళు ఏమి గొడవచేయకుండా భోంచేస్తున్నారు

గోపాల్ తన సతీమణి అస్వస్థత గూర్చి చెప్తుంటూ తాను ఇంతకంటే ఎక్కువ చేయలేక పోయినందుకు నొచ్చుకుంటూ వేడాడు ఆయన "పరవాలేదు" అంటూ భోంచేశారు.

భోజనానంతరం ఇల్లంతా చూస్తూ "పెద్ద ఇల్లేనే" అన్నాడు.

"ఔను సార్...! ఆ పేరు కూడా స్వంతం ఉండేది. కానీ మా అమ్మగారికి చాలా జబ్బు చేసింది క్యాన్సర్ వచ్చింది బొంబాయికి మూడుసార్లు వెళ్ళాము. ఖర్చులకు కావలసివచ్చి అమ్మేశాము. ఈ ఇల్లు తాకట్టులో ఉంటే ఎలాగో విడిపించాము"

"మీ భార్య పనిచేస్తుందా?"

"లేదు సార్.....కానీ మిషన్ పని బాగా తెలుసు. పిల్లలకు గుడ్డలు—చివరకి నావి కూడా కుడుతుంది. సంగీతం వచ్చు. ఇద్దరమ్మాయిలకు పిడేలు నేర్పుతుంది........"

"ఆ ముందు గది అద్దెకిస్తే మీకు ఈ ఇల్లు సరిపోతుంది కదా?" ఆయన చుట్టూ కలయచూశారు.

"ఔనండి...ఇచ్చాము. పదిహేను రూపాయలు.... కానీ మా పిల్లల అల్లరి భరించలేక ఖాళీ చేశారు. ."

"ఏ మయ్యా ఆయనకు బల్లలంటే భయం.

ప్లాస్టిక్ బల్లిని తెచ్చి గోడ కంటిస్తే భయపడి వెళ్లాడు........" అరవింద్ చెబుతూంటే....శాంతి అడ్డొచ్చి "ఒకటికాదు...మూడు...బొమ్మలే...అన్నా వినకుండా వెళ్లిపోయాడు." విరగబడినవ్వుతూ అంది.

గోపాల్ ఎంతో ప్రయత్నంతో కోపాన్ని దిగమింగి పైకి నవ్వుతూ ఎలాగో పిల్లల్ని వేరుచేసి ఉరిమిచూచి ఆయనతో ముందుగదిలో కూచున్నాడు.

ఓ అర గంటకు కావొచ్చింది. అందరి దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయాడు. పిల్లలతో మరి మాట్లాడలేదు. తారకెంతో ఆశ్చర్యం వేసింది. మాట్లైనా అసలేదు.....పలుకరించలేదు. ఔను వీళ్ళు చేసిన గొడవకు కోపం రాకుండా ఉంటుందా?

అటు ఆయన కదిలీ కదలక ముందే తార పిల్లల్ని దగ్గరకు రమ్మని చెవులు నులిమింది. ముందు గడియ వేసి తార గదిలోకొచ్చాడు గోపాల్.

నేరస్థుల్ని చాపమీద కూచోబెట్టి వాళ్ళు చేసిన ఆగడమంతా తార ఒక్క పొల్లు పోకుండా ఏకరువు పెట్టింది.....

"అసలు మీకెలా కలిశారాయన?" హుంకరించాడు గోపాల్.

"పార్క్‌లో ప్యూన్‌తో తిరుగుతూంటే మాట్లాడించారు. మేము ఇంటికొస్తుంటే మాతోపాటు వస్తానని మమ్మల్నిగూడా కారులో ఎక్కించుకుని వచ్చారు". అరవింద్ చిన్నగా మాట్లాడుతున్నాడు.

"రాగానే వచ్చి చెప్పలేదేం?" కళ్లెర్రజేసేసరికి పిల్లలు అదిరిపడ్డారు.

"లోపలికెళ్తే నువ్వు లేవు. అమ్మ నిద్రపోతుంది. ఫరవాలేదు మనం కూచుందాం ..... అంటే కూచున్నాం..........."

"మామయ్యగారని చెప్పావు నాన్నా" అందుకని శాంతి మాటలు నాన్చింది.

"ఐతే నేను చెప్పినలా కుదురుగా ఎందుకు కూచోలేదు? మీ గొడవంతా ఏమిటి?......."

పిల్లలకేం అర్థం కాలేదు. గొడవేముంది? ఎంచక్కా మాట్లాడుకున్నారు. నవ్వుకున్నారు... తండ్రి ముఖంలోకి దైన్యంతో చూస్తున్నారు. భయంగా ఉంది వాళ్లకి— తంతాడని...........

గోపాల్ హృదయం జాలితో ద్రవించింది. తార ప్రక్కలో కూచుని ఒంటిమీద చెయ్యివేశాడు. తార శరీరం కాలిపోతోంది.

"తారా......అనవసరంగా శ్రమపడ్డావు...ఉద్రేకపడ్డావు. అందుకే జ్వరమొచ్చింది..... పోనీ...మన ప్రయత్నం మన చేశాం.....జయాపజయాలు స్వకృత్యాలు కావు. మన తప్పులేదు. కావలసిన విధంగా మర్యాద జేశాము. ఇక ఆయన దయ..... పిల్లలకేం తెలుసు...అనవసరంగా క్షోభపడక....." గోపాల్ పాలు త్రాగనిచ్చి తార నిద్రపోయేవరకు దగ్గర కూర్చున్నాడు. పిల్లల్ని పడుకోబెట్టి తను ప్రక్క జేరేసరికి పదకొండు గంటలైంది.

ఆ రోజు జరిగినదంతా సింహావలోకనం చేస్తున్నాడు.

ఎంతో శ్రమపడ్డాడు......ఆఫీసరు మాటలను బట్టి చూస్తే చాలా సంతోషించినట్టుగానీ .... అసంతృప్తిపడినట్లుగానీ లేదు. పైగా...."నువ్వు బాగా ఉన్నవాడివి... ఇల్లుంది..... రెండువందల యాభై జీతం......కష్టంలేకుండా దినాలు వెళ్లబుచ్చగలిగే స్థోమత ఉందిగా... ఇక నీకెందుకు పై ఉద్యోగం?" అని ధ్వనించేలా మాట్లాడాడు... నీ ఉద్యోగానికి నీ తాహతకు ఇంత ఇల్లు అనవసరం. ఓ భాగం ఇల్లు అద్దెకిమ్మని సలహా.... ఎప్పటిదో ఫర్నిచర్ వెండిసామాను అంతా చూచినాకేం తక్కువ లేదనుకుని ఉండవచ్చు.... ఏమో ఆతని హృదయాలోచనలు గ్రహింప లేదు. ఆశ మాత్రం పూర్తిగ వదలుకోలేదు.

ప్రతి రోజూ ఈ నూతన ఉద్యోగం సంగతి ఏమైన తెలుస్తుందేమోనని ఆశతో ఎదురు చూచేవాడు.

నెలరోజులయ్యాక కబురు తెలిసింది. ఎమర్జెన్సీ వల్ల క్రొత్త బ్రాంచి స్థాపనకు ప్రభుత్వం అంగీకరించలేదని.

తీరిపోయింది. ఇంతటితో ఆ ఆశ గూడ వదలింది. ఇల్లు చేరగనే తారతో చెప్పాడు. ఆమె విని పూరుకుండి. పోనీ ఆయనకు కోపం లేకుండా ఉంటే చాలు. ఈ పనిలోనే నిశ్చింతగా ఉండొచ్చు.

వారం రోజులకు గోపాల్‌కో ఉత్తరం వచ్చింది. కవరు తెరచి ఉత్తరం చదివి పట్టరాని సంతోషంతో ఇల్లు చేరాడు. ఆ రోజు శనివారం. పిల్లలు ముగ్గురు ఆవేళకి ఇంట్లోనే ఉన్నారు.

ముగ్గుర్నీ కౌగలించుకుని ముద్దులు పెడుతున్నాడు. అరవింద్ కాస్త సిగ్గుపడ్డాడు. తార ఈ దృశ్యాన్ని వింతగా చూస్తోంది. గుమ్మం అవతల నుంచుని గమనిస్తోంది.

---

క్లాసులో టీచరు: (పిల్లలతో) శీతాకాలములో రోజు తక్కువగాను, వేసవిలో ఎక్కువగాను ఎందుకు వుంటుంది?

విద్యార్థి : సార్! చలికాలం చల్లగానుండి, సంకోచము పొందుటవలన, వేసవిలో వేడిమూలమున వ్యాకోచము పొందుటవలనను.

బి. రాంమోహన్ (భాగల్‌కోట)

---

తారా.... అంటూ అమాంతంగా చేతుల్లోకి తీసుకుని చెవిలో ఏదో గొణిగాడు. తార కళ్ళు తారకలైనై. భర్త బాహు బంధం నుంచి తప్పుకుని ఉత్తరం అందుకుని చదవసాగింది.

"...... బ్రాంచి స్థాపన ఇప్పటిలో రూపొందదు. కానీ నిన్ను గూర్చి నా మిత్రుడికి చెప్పాను. ఇంకా రెండు నెలలో వారి బ్రాంచి మేనేజరు రిటైర్ అవుతారు. ఆ ఖాళీలో నిన్ను వేసుకుంటాడు. విజయవాడకు వెళ్ళవలసి వస్తుంది.

ఈ సందర్భంలో మీ కుటుంబాన్ని గూర్చి కొంత మెచ్చుకోక తప్పదు.

అస్వస్థతగా ఉన్న భార్యతో, ముగ్గురు అల్లరి పిల్లలతో ఇంటిని, ఇల్లాలిని, పిల్లలను ఎంతో నేర్పుతో చూచుకున్నావు. హోటల్ భోజనం గాక నీ స్వహస్తాలతో వండిన భోజనం పెట్టావు. ఇల్లంతా శుభ్రంగా, ఎంతో అమరికగా పెట్టావు. నీ ఆఫీసరును — నీ ఆతిథ్యం కోసం వేచి ఉన్నానని విరిగి ఆందోళన పడుతున్నా— పరోపకార చింతతో మీ పొరుగు వారికి సహాయ పడ్డావు.

ముఖ్యవిషయం— పిల్లలను మంచి క్రమ శిక్షణలో పెంచుతున్నావు. ఇలా రాస్తున్నానని ఆశ్చర్యం కలుగవచ్చు. బాల్య చాపల్యంతో పిల్లలు అల్లరి పనులు చేస్తారు. చిలిపితనానికి, వారుచేసే గొడవకు కొంత హద్దు ఉంది. ఈ హద్దు మితిమీరి ప్రవర్తించినప్పుడు తప్పక శిక్షించాలి. పిల్లలు ముగ్గురు బుద్ధిమంతులు— వారిలో క్రూర, దుష్ట గుణాలు లేవు. అమాయక, లేత, పవిత్ర హృదయాలవి.... !

నిజం చెప్పాలి. పిల్లలు ముగ్గురు నా హృదయాన్ని ఆక్రమించుకున్నారు. వారితో గడిపిన ఆ కొద్ది మధుర గడియలు, నా మనోఫలకంపై చెరుగని ముద్రలు వేశాయి. అంతరంలో బహుశః వారిపై అంకురించిన మమత కారణంగా నిన్ను ఇష్టపడి, నీపై సదభిప్రాయం కల్గించుకున్నానంటే ఆశ్చర్యం కాదు. ఈ అంతర్గత భావానికో రూపు గల్పించి, పిల్లల భవిష్యత్తును తేజోమయం చేయాలన్న సంకల్పంతో ఈ చిన్న సహాయం చేయగల్గాను.

నీ వ్యక్తిత్వం, అతి స్వల్ప విషయాలలో కూడ అగుపర్చిన జాగరూకత, శ్రద్ధ—సహనం, ప్రజ్ఞ, స్థిర నిశ్చయత నన్నాకర్షించాయి. భావి ఔన్నత్యానికి ఇవేపాలరాతి సోపానాలు. ఇటువంటి వాడే మాకు కావలసినది.

అన్నింటికంటే ముఖ్యం— డబ్బు విలువ మీకు తెలుసు. గర్వం— అహంభావం, లేకండా సంసారాన్ని దిద్దుకురావటంలో మీ నేర్పు నన్నెంతో సంతృప్తి పర్చింది. చేతనైనంతగా శ్రీమతి తార నీకు చేదోడుగా నుండటం శ్లాఘనీయం.

నీకు ఆఫీసరును 'గానీ, పిల్లలకు నేను "పొడుమామయ్య"ను. వచ్చేవారం పిల్లలకు కొన్ని వస్తువులు పంపుతున్నాను.

నాకు సంతానం లేదు. అందుకనే నేమో, పసి హృదయాల్లోని ప్రేమ, సౌకుమార్యాలను గ్రహించి వారి సాన్నిధ్యంలో ఆనందంగా నిశ్చింతగా గడిపి వారి ప్రేమను పొందాలని తాపత్రయ పడ్డాను.

మీ కుటుంబాన్ని గూర్చి క్షుణ్ణంగా తెలుసుకుని సంతృప్తి చెందాను.

మీకు ఆశీస్సులు.
ఇట్లు
అమర్‌సింగ్"

తార అప్రయత్నంగా చెక్కిళ్ళపై కారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ గాద్గదికంతో అంది "ఎంతటి ఉన్నత హృదయం వారిది?.... " అంతకన్నా ఎక్కువ మాట్లాడలేకపోయింది.

బిక్క ముఖంతో చూస్తున్న పిల్లల నొక్కొక్కరినీ మార్చి మార్చి హృదయానికి హత్తుకుంటూ ముద్దులు పెడ్తోంది.

ఇదే అదను— సమయం మించిన లాభం లేదనుకుని అరవింద్ అన్నాడు: "మరి నాన్నా—అమ్మా... సాయంత్రం సర్కస్‌కు తీసుకెళ్ళరూ?"

భార్యా భర్తలు మధుర మందహాస వదనులైనారు. "అల్లాగే... వెడదాము. మీ పొడు మామయ్య యేమిటో పంపుతారట." తార అంటూనే, మధ్యలో అరుణోను ముద్దులతో ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

★